సాక్షి సంగారెడ్డి

సోమవారం, 11, ఆగస్టు, 2025



పంటలకు ప్రాణం

ఎండుతున్న పంటలకు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షం జీవం పోసింది.

వివరాలు 8లో ▸



టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్

కొండపాక మండలం దుద్దెడ శివారులో ఉన్న టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ అయింది.

వివరాలు 8లో ▸

సింగూరుకు ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. భారీ వర్షాలతో ప్రతి రోజు డ్యాంలోకి వరద నీరు చేరుతుంది. ఆదివారం ఉదయం ప్రాజెక్టులోకి 1964 క్యూసెక్కులు, సాయంత్రం 1188 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. 29.917 టీఎంసీల నీటి సామర్థ్యం గల డ్యాంలో ప్రస్తుతం 21.344 టీఎంసీలు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రద్దీకి అనుగుణంగా బస్సులు



బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఖేడ్ నుంచి 10 ప్రత్యేక బస్సులను నడిపినట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఆదివారం ఖేడ్ రాజీవ్ కూడలి సమీపంలో బస్టాప్ వద్ద ఆర్టీసీ పర్యవేక్షణ కమిటీ పనితీరు, బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రద్దీతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూశామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ డీఎం నర్సింహులు, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, కంట్రోలర్ రాములు ఉన్నారు.

యూరియా కోసం తరలివచ్చిన రైతులు



చేగుంటలో యూరియా తీసుకెళ్తున్న రైతులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మక్కరాజీపేట రోడ్డులోని ఎరువుల దుకాణానికి ఆదివారం యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు భారీగా తరలివచ్చారు. లారీ యూరియా లోడు దింపుకున్న గంటలోపే ఎగబడి తీసుకెళ్లారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో వరి పంటలకు రెండో దఫా యూరియా వేసే సమయం రావడంతో కొరత వస్తుందేమోనని రైతులు తీసుకెళ్లారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇటీవల కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులంతా ఈనెల 13వ తేదీలోగా రైతు బీమాకు దర ఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి జూన్ 5 వరకు కొత్త పాస్‌బుక్‌లు పొందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు రైతుబీమా వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపడతారని పేర్కొన్నారు.

రిజర్వేషన్లపై మత రాజకీయం



సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకుల ధర్నా

సంగారెడ్డి(ఎడ్యుకేషన్): బీసీ రిజర్వేషన్లకు మతం రంగు పులమడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ చౌక్ దగ్గర బీసీ రిజర్వేషన్ల కోసం చట్టం చేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ 42 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో చట్టం చేయకుండా మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు సైతం బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ విద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేసే పోరాటంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ, నాయకులు అశోక్, రమేశ్‌గౌడ్, నర్సింహారెడ్డి, మహేశ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పట్టణంలోని 132/33 కేవీ ఫీడర్ మరమ్మతులలో భాగంగా 11 కేవీ ఆరూర్, ఆత్మకూర్, నిజాంపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 5: 30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పాదయాత్రగా వస్తున్న మహారాష్ట్ర భక్తులు

కేతకీకి పోటెత్తిన భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం ఆదివారం సెలవు రోజు కావటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చారు. అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం క్యూలైన్లలో వేచి ఉండి, గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని అహ్మదాపూర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది భక్తులు ఆలయానికి పాదయాత్రగా వచ్చారు. వారం రోజులుగా భజనలు చేసుకుంటూ ఆదివారం సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు.



క్యూలైన్‌లో రద్దీ

పేద విద్యార్థులకు అల్పాహారం

- 15 ప్రభుత్వ పాఠశాలల్లో 1,600 మందికి లబ్ధి
- ఓ ఫార్మా కంపెనీ సహకారంతో ఆకలి తీరుస్తున్న 'అక్షయపాత్ర'
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



కంది మండలం చేర్యాలలో అల్పాహారం అందిస్తున్న నిర్వాహకులు

సంగారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఇక నుంచి ప్రతి రోజు అల్పాహారం అందనుంది. ఉదయం ఇంటి నుంచి తిని వెళ్లకుండానే పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు వేడివేడి అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొహాన్సర్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీ సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,600 మంది విద్యార్థులకు ఈ నెల 7వ తేదీ నుంచి అల్పాహారం అందుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకో వెరైటీ..

ఉదయం చదువుకోడానికి వెళ్లిన విద్యార్థులకు వారంలో రోజుకో వెరైటీ టిఫిన్ అందిస్తున్నారు. ఒకరోజు ఇడ్లీ, మరుసటి రోజు పూరి, ఉప్మా, దోష, బోండా, కిచిడీ తదితర టిఫిన్లు అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉదయం పూట పాఠశాలలోనే అల్పాహారం చేస్తున్నారు.

సీఎస్ఆర్ నిధుల నుంచి ఖర్చు..

జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యాలు కొన్ని పాఠశాలలను దత్తత తీసుకొని సీఎస్ఆర్ నిధుల ద్వారా వచ్చిన డబ్బులతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ కంపెనీ పటాన్‌చెరు, కంది మండలాల్లో 15 పాఠశాలల్లో 1,600 మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తుంది. ఈ కంపెనీ చేస్తున్న మంచి పనితో అల్పాహారం చేస్తున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఇతరులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ కంపెనీ మాదిరిగానే మరికొన్ని కంపెనీలు కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అలాగే అక్షయపాత్ర ఫౌండేషన్ వారు కూడా ఎన్ని కంపెనీలు వచ్చి తమకు బాసటగా ఉంటారో తాము కూడా వివిధ పాఠశాలలకు అల్పాహారంతో పాటు భోజన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొంటున్నారు.

మంజీరాపై రబ్బరు డ్యాం

- త్వరలో డీపీఆర్
- పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించిన ఇంజనీర్లు



రబ్బర్ డ్యాం గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న కన్సల్టెన్సీ నిర్వాహకులు

నారాయణఖేడ్: మంజీరా నదిపై మనూరు మండలం రాయిపల్లి వద్ద రబ్బరు డ్యాం ఏర్పాటుకు వీలైనంత త్వరగా సమగ్ర ప్రణాళిక (డీపీఆర్) రూపొందించి అందజేయాలని కన్సల్టెన్సీ నిర్వాహకులకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. నీటి పారుదల శాఖ విశ్రాంత సీఈ విఠల్‌రావు, హైడ్రో కన్‌స్ట్రక్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు సమన్వయకర్త ప్రకాశ్‌రెడ్డి ఆదివారం రాయిపల్లి వద్ద మంజీరా నది పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి రబ్బరు డ్యాం గురించి వివరించారు. మంజీరా నదిపై రాయిపల్లి వద్ద గల వంతెనను ఆరు ప్యానెళ్లుగా.. 320 మీటర్ల మేర రబ్బరు డ్యాం ఏర్పాటు చేయాలి. రూ. 200 కోట్లు ఖర్చువుతుందని ప్రాథమిక అంచనా. బుల్లెట్ ప్రూఫ్ ఉండి ఎంత వరద వచ్చినా తట్టుకుంటుంది. 50 ఏళ్ల వరకు జీవిత కాలం ఉండగా, నిర్వహణ ఖర్చు నిర్మాణ వ్యయంలో ఒక శాతం మాత్రమే ఉంటుంది. అయిదు మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చు. అవసరాలకు అనుగుణంగా హెచ్చుతగ్గులు చేసుకోవచ్చు. పూడిక సమస్య ఉండదు. ఖేడ్, అందోలు, జహీరాబాద్ ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి వేసవిలోనూ బోర్లు పనిచేసే అవకాశాలు ఉంటాయి. త్వరలోనే డీపీఆర్ రూపొందించి అందజేస్తామని కన్సల్టెన్సీ నిర్వాహకులు వివరించారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బాల బాలికల్లో నులి పురుగుల సమస్య నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఏటా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ పైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు ప్రభుత్వ ఐడియా ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రెండు విడతల్లో నులి పురుగు నివారణ మాత్రలు ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి నిర్మల, డాక్టర్ మనోహర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు కంకర శ్రీను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని 20వ వార్డులో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రజల గుండెల్లో నిలిచేది గులాబీ జెండా అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తిలో ఉన్నారన్నారు. అనంతరం అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అన్నిదానాల్లో అన్నదానం గొప్పది

సిద్దిపేటజోన్: అమర్నాథ్, కేదారినాథ్ యాత్రలు చాలా పవిత్రమైనవని, అలాంటి ప్రాంతాల్లో యాత్రికులకు అన్నదానం చేయడం చాలా గొప్ప విషయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. 35 రోజుల పాటు అమర్నాథ్ యాత్రికులకు భోజన వసతి కల్పించిన సేవా సమితి సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూఅమర్నాథ్ అన్నదాన సేవా సమితి సిద్దిపేట పేరును దశదిశలా వ్యాప్తి చేసిందని అన్నారు. అన్నదాన సేవా సమితి సొంత డబ్బులతో దక్షిణాది యాత్రికులకు సాయంగా నిలవడం అభినందనీయమన్నారు. చిత్తశుద్ధితో ఏ పని చేసిన విజయం చేకూరుతుందన్నారు.

గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులు

- మరికొన్ని మహారాష్ట్ర నుంచి..
- స్థానిక సంస్థల నిర్వహణకు సేకరణ



సంగారెడ్డి జోన్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకొస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహణకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుతున్నారు. ఇప్పటికే గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులను తెప్పించగా, మరికొన్ని మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కొత్తగా ఓటరు జాబితా రూపొందిస్తుండగా, తాజాగా బ్యాలెట్ బాక్సులు వచ్చాయి. జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2,921 పెద్దవి, 1,200 మీడియం బ్యాలెట్ బాక్సులు ఉండగా, తాజాగా గుజరాత్ నుంచి 1,590 పెద్ద బ్యాలెట్ బాక్సులు ఇటీవల జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వీటిని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో భద్రపర్చారు. అదే విధంగా మహారాష్ట్ర నుంచి 1,200 బాక్సులు తెప్పించుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

జిల్లా వివరాలు	
మండలాలు	26
గ్రామ పంచాయతీలు	631
జిల్లా పరిషత్ చైర్మన్	1
ఎంపీపీలు	25
జెడ్పీటీసీలు	25
ఎంపీటీసీలు	271

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

పంచాయతీ ఎన్నికలకు ఎలాంటి నోటిఫికేషన్ రాకపోయినా, నిర్వహణకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్‌స్టేషన్‌లను గుర్తించారు. బ్యాలెట్ పేపర్లను సైతం ముద్రించి, జాబితాను సిద్ధం చేయగా, కొత్తగా వార్డుల వారీగా మార్పులు చేర్పులు చేస్తూ ఓటరు జాబితా తయారు చేయాలని మౌఖిక ఆదేశాలు రావటంతో తయారు చేసే పనిలో నిమగ్నం అయ్యారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణకు అధికారులకు శిక్షణ సైతం నిర్వహించారు. ప్రస్తుతం అవసరం మేరకు బ్యాలెట్ బాక్సుల ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు ఆశావహులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల అయినా అంతా సిద్ధంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 7,83,379 మంది ఓటర్లు ఉండగా, 5,542 పోలింగ్‌స్టేషన్‌లు ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికి పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

మెదక్ కలెక్టరేట్: గ్రామాల్లో ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేపడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన జిల్లాస్థాయి పార్టీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో మురుగు నీటి కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. పంచాయతీలకు బడ్జెట్ లేక పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదన్నారు. దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు ప్రతీ నెల జీతాలు రెగ్యులర్‌గా చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య, జిల్లా కార్యదర్శి నర్సమ్మ, కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, బాలమణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. దీవించమ్మా



పాపన్నపేట(మెదక్): దుర్గమ్మా.. కరుణించమ్మా అంటూ వేలాది భక్తులు ఆదివారం ఏడుపాయల అమ్మవారిని వేడుకున్నారు. అర్చకులు వేకువజామునే వన దుర్గమ్మను వంకాయ రంగు పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఒడి బియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం వర్షం కొంత ఇబ్బంది కలిగించినా, మధ్యాహ్నం వరకు వాతావరణం అనుకూలంగా మారడంతో భక్తులు ఆనందంగా గడిపారు.

మల్లన్న దరి.. భక్తఝరి





స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి (ఇన్‌సెట్) నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు స్వామి వారి నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామునుంచే స్వామిదర్శనానికి భక్తులు బారులు తీరారు. అభిషేకాలు, నిత్యకల్యాణం, ప్రత్యేకపూజలు చేశారు. పట్నాలు, గంగిరేణు చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నా రు. ఏర్పాట్లను ఆలయ ఏఈఓ బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ పర్యవేక్షించారు.

తిరుగు ప్రయాణం తిప్పలు

కిక్కిరిసిన జహీరాబాద్ బస్టాండ్

జహీరాబాద్ టౌన్: రాఖీ పండుగ, వరుస సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం నియోజకవర్గం నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చే ప్రయాణికులతో జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. ఉద్యోగం, ఉపాధి, విద్యాభ్యాసం తదితర పనుల కోసం హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాలకు వెళ్లిన వారంతా పండగలకు ఊర్లకు వచ్చారు. సెలవులు ముగియడంతో మళ్లీ నగరానికి వెళ్తున్నారు. జహీరాబాద్‌తో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్ వచ్చారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రమాణికులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. బస్సు వచ్చిందంటే సీటు కోసం పరుగులు తీస్తున్నారు. అదనంగా మరి కొన్ని బస్సులు వేయాలని కోరుతున్నారు.



బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు



బస్సుల కోసం ఎదురుచూస్తూ..

క్లుప్తంగా

రామకృష్ణకు విద్యారత్న పురస్కారం



అవార్డును అందుకుంటున్న హెచ్‌ఎం రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రామకృష్ణ జాతీయ స్థాయి విద్యారత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ అధ్యక్షుడు కొంపల్లి సత్యనారాయణ ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు. విద్యా, సామాజిక సేవా రంగంలో చేసిన విశేష సేవలకు గాను ఈ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం రాజశ్రీ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు అభినందించారు. కార్యక్రమంలో స్వర్ణగిరి ఆలయ వ్యవస్థాపకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఈనెల 17న జోగిపేటలో నిర్వహించనున్న పంచాయతీ కార్మికుల జిల్లా మహాసభ నేపథ్యంలో ఆదివారం ఖేడ్‌లో సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేస్తూ, గత ప్రభుత్వం తెచ్చిన జీవో 51ను రద్దు చేయాలన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేశ్, నాయకులు సతీశ్, అంజయ్య, బాలయ్య, లక్ష్మి, రేవతి పాల్గొన్నారు.

క్యూబా ప్రజలకు అండగా ఉండాలి



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్యూబా ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సీఐటీయూ రాష్ట్ర సభ్యుడు కే.రాజయ్య అన్నారు. ఆదివారం బెల్ టౌన్‌షిప్‌లో బెల్ ఎంప్లాయీస్ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో క్యూబా సంఘీబావ నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని దేశ ప్రజలందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అమెరికా పన్నుల కారణంగా క్యూబాలో చిన్నారులు కనీసం పాలు తాగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, భాష, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



చోరీకి ప్రయత్నించిన వ్యక్తి

నర్సాపూర్: పట్టణంలోని యాక్సిస్ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించాడు. స్థానిక ఎస్ఐ లింగం కథనం ప్రకారం... ఏటీఎంలోని డయల్ ప్యాడ్ స్క్రూలు విప్పేందుకు యత్నించాడు. ఏటీఎం సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చోరీకి ప్రయత్నించిన వ్యక్తి కదలికలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయని చెప్పారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహులు

సంగారెడ్డి క్రైమ్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూర్ గ్రామానికి చెందిన తలారి నర్సింహులు(40) బతుకుదెరువు కోసం ఎనిమిదేళ్ల క్రితం కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి వచ్చి స్థిరపడ్డాడు. వృత్తిరీత్యా పట్టణంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న ఉదయం 11గంటల సమయంలో వాళ్ల అమ్మను బస్సు ఎక్కించడానికి సంగారెడ్డి కొత్తబస్టాండ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆదివారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పంటలకు ప్రాణం

వర్షాలతో మొక్కజొన్న పత్తి, వరికి మేలు

- 20 రోజుల తర్వాత సమృద్ధిగా వానలు
- చెరువులు, కుంటల్లోకి చేరిన వరదనీరు
- జిల్లాలో 3.70 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- సంతోషంలో అన్నదాతలు



వర్షంతో ప్రాణం పోసుకున్న మొక్కజొన్న

దుబ్బాక: ఎండుతున్న పంటలకు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షం జీవం పోసింది. ఇరవై రోజులుగా వానలు లేకపోవడంతో పంటలు ఎండు ముఖం పట్టాయి. ముఖ్యంగా వర్షాధార పంటలు వానలు లేకపోవడంతో చాలా వరకు దెబ్బతిన్నాయి. రైతులు వేసిన వరి పొలాలు సైతం నీళ్లు లేక బీటలు వారుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

3.70 లక్షల ఎకరాల్లో సాగు

వానాకాలం ప్రారంభమై 2 నెలల 15 రోజులు కావస్తున్నా ఆశించినంత వర్షం లేకపోవడంతో పంటల సాగు అంతంత మాత్రమే ఉంది. అయితే జిల్లాలో ఈ వానాకాలం 5.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని అంచనా వేయగా.. ఇప్పటి వరకు మొత్తం 3.70 లక్షల ఎకరాల్లోపే సాగు కావడం శోచనీయం. ఇంకా 2 లక్షల ఎకరాల వరకు సాగు చేయాల్సి ఉన్నా సక్రమంగా వర్షాలు లేక చేయలేదు. వరి 3.70 లక్షల ఎకరాల్లో అంచనా ఉండగా.. ఇప్పటి వరకు 2.30 లక్షల ఎకరాల్లోనే నాట్లు వేశారు. మొక్కజొన్న 40 వేల ఎకరాల టార్గెట్ ఉండగా 25 వేల ఎకరాలు, కంది 6028, పత్తి 10,6170 ఎకరాల్లో, స్వీట్ కార్న్ 1352 ఎకరాల్లో సాగయ్యాయి. పత్తి మొలక దశలోనే వానలు సక్రమంగా లేకపోవడంతో చేను పెరుగుదల అంతంతగానే ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటలకు నష్టం వాటిల్లిందని, ఈ వర్షం కూడా పడకపోతే చాలా నష్టం వచ్చేదని వాపోతున్నారు.

ఎండు ముఖం పట్టిన దశలో

శనివారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో సమృద్ధిగా వాన కురిసింది. 20 రోజుల తర్వాత భారీ వర్షం పడటంతో పంటలకు ప్రాణం వచ్చినట్లయింది. ముఖ్యంగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, కంది, పెసర, బొబ్బెర పంటలకు ఈ వర్షం చాలా మేలు చేసింది. పంటలు ఎదుగుతున్న క్రమంలో వానలు లేక వాడిపోయాయి. జిల్లాలోని దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ నియోజకవర్గాలతో పాటు అన్ని మండలాల్లో ఎండు ముఖం పట్టిన పంటలు ప్రస్తుత వానలతో జీవం పోసుకున్నాయి.



పత్తి చేనులో నిలిచిన వర్షం నీరు

సమయానికి వర్షం పడింది



నేను 10 ఎకరాల్లో మొక్కజొన్న వేసిన. కొద్ది రోజులుగా వాన పడకపోవడంతో బోర్ల ద్వారా డ్రిప్ సౌకర్యంతో నీటిని అందించేందుకు పడరాని పాట్లు పడ్డా. పంటకు సరిగా నీరు అందక చాలా దెబ్బతింది. సరైన సమయంలో వాన పడటంతో పంటకు ప్రాణం పోసినట్లయింది.

– వంగాల మహిపాల్‌రెడ్డి, రైతు, వర్ధరాజుపల్లి

పంటలకు మేలు



జిల్లాలో సమృద్ధిగా వర్షం పడటంతో పంటలకు చాల మేలు చేకూరుతుంది. రెండురోజులుగా కురిసిన వర్షం మొక్కజొన్నతోపాటు పత్తి, కంది తదితర పంటలకు మేలు చేసింది. ఈ వర్షాలతో వరి నాట్లు సైతం వేసుకుంటారు. వర్షాధార పంటలు, ఇతర ఆరుతడి పంటలకు సమృద్ధిగా కురిసిన వర్షం ప్రాణం పోసింది.

– స్వరూపరాణి, జిల్లా వ్యవసాయాధికారి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య



నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని, తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల పట్ల బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని,సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వాజిద్ అలీ, నాగేశ్వరరావు, అర్జున్, సురేశ్ , శ్రీధర్, పెంటయ్య, నాగులు భాషా, రమేశ్ పాల్గొన్నారు.

టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్

- దుద్దెడ శివారు రాజీవ్ రహదారిపై 3 గంటలకు పైగా రద్దీ
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



టోల్ ప్లాజా వద్ద వాహనాలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ శివారులో గల రాజీవ్ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ అయింది. రాఖీ పండుగతో పాటు రెండు రోజుల వరుస సెలవుల నేపథ్యంలో సొంతూర్లకు వచ్చిన వారంతా తిరిగి హైదరాబాద్‌కు పయనమవ్వడంతో టోల్ ప్లాజా వద్ద సుమారు 2 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ, మంథని, సిద్దిపేట తదితర పట్టణాల నుంచి హైదరాబాద్‌కు వాహనాలు వెళ్తుండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో సుమారు 3 గంటలకు పైగా రద్దీ కొనసాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు సాఫీగా వెళ్లేలా టోల్ ప్లాజా సిబ్బంది, త్రీ టౌన్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

యోగా పోటీలకు ఐదుగురు ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన సాధకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ స్థాయి యోగా పోటీలకు సిద్దిపేట జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారని యోగా శిక్షకుడు సతీశ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7, 8న నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సీనియర్ మెన్స్ విభాగంలో సిద్దిపేటకు చెందిన సురేశ్ యాదవ్, సీనియర్ మహిళా శిభాగంలో కవితా రావు, బ్యాక్ బెండింగ్‌లో సంపత్ కుమార్, సీనియర్ మహిళా విభాగంలో ట్విస్టింగ్ అంశంలో సంధ్య, నర్మద అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే ప్రసన్న, సంధ్య, మనీషా మెడల్స్ అందుకున్నారు.

సేంద్రియ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి



కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు సేంద్రియ సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అగ్రికల్చర్ విద్యార్థినులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తునికి ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రం, మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం, వరి పంటకు సోకే చీడ పురుగులు, వాటి లక్షణాలు, నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పంచగవ్య, జీవామృతం వల్ల కలిగే లాభాలను వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య, విద్యార్థినులు అనూష , ఐశ్వర్య, అశ్విని, అపర్ణ, శ్రావణి ఉన్నారు.

పత్తి చేను పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): పత్తి చేనును పరిశీలించి, రైతులు పత్తిని ఏ పద్ధతిలో సాగు చేస్తున్నారనే విషయాలను తెలుసుకున్నామని మల్లారెడి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం కేవీకే శాస్త్రవేత్త డా.రవికుమార్ ఆధ్వర్యంలో మండలంలోని శీలాంపల్లి గ్రామంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పత్తిని పరిశీలించారు. మొక్కల మధ్య ఎంత దూరం ఉండాలో, ఎలాంటి మొక్కలు నాటాలో తెలుసుకున్నారు. విద్యార్థులు లతాశ్రీ, దేవిక, చందన, అక్షయ, అశ్విని, భావన, భవాని, శ్వేక పాల్గొన్నారు.

హుస్సేన్ నగర్‌లో నీటి కటకట

- భగీరథ పైపులైన్ పగిలి నిలిచిన సరఫరా
- 10రోజులుగా గ్రామస్తుల అవస్థలు



చీకుర్తి గ్రామ శివారులో వృథాగా పోతున్న నీరు



తాగు నీటి కోసం బావుల వద్దకు వెళ్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సేన్ నగర్ గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. చీకుర్తి గ్రామ శివారులో సరఫరా పైపులైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతుంది. ఫలితంగా 10 రోజుల నుంచి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో మూడు సింగిల్ ఫేస్ మోటార్లు ఉండగా అందులో రెండు పాడయ్యాయి. వాటిని బాగు చేయించాలని పంచాయతీ కార్యదర్శికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందరు సింగిల్ ఫేస్ మోటారు ద్వారా వస్తున్న కొద్ది పాటి నీటిని తీసుకెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొంత మంది బావులు, సమీపంలో మంజీరా నది నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం వల్ల బావులు, నది నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైపులైన్‌ను బాగు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదె

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని న్యామతాబాద్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నల్ల శివకుమార్ ఎప్పటిలాగే గేదెను పొలం నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. ఇంటి ముందు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభం ఉంది. అక్కడికి వెళ్లిన గేదెకు సపోర్టు వైర్ ద్వారా కరెంట్ రావడంతో షాక్‌కు గురైంది. గమనించిన యజమాని వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించాడు. అప్పటికే గేదె మృతి చెందింది. విలువ సుమారు లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.

మరోచోట వాహనం ఢీకొని..

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీకొని పాడిగేదె మృతిచెందింది. ఈ ఘటన తూప్రాన్- నర్సాపూర్ హైవేపై శివ్వంపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మెతుకు బాలేశ్ గేదెలతో ఉపాధి పొందుతున్నాడు. శనివారం రాత్రి పశువుల పాకలో నుంచి ఓ గేదె రోడ్డుపైకి రావడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గేదె మృతిచెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

రైస్ మిల్లులో భారీ చోరీ

రూ.3.53 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన రైస్ మిల్ కార్యాలయం తాళాలు పగులగొట్టి దొంగలు నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని రంగంపేట గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, రైస్ మిల్ యజమాని ముప్పిడి కృష్ణ వివరాల ప్రకారం... గ్రామంలోని తిరుమల రైస్‌మిల్ మెయిన్ గేట్ తాళాలు, కార్యాలయం గది తాళాలను దొంగలు పగులగొట్టారు. గదిలో ఉన్న బీరువాలో దాచిన సుమారు రూ.3.53 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం ఎస్ఐ మహేశ్ ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. రైస్ మిల్లు ఆవరణలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, తెలిసిన వ్యక్తులే ఈ దొంగతనానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హైమద్ మొయినుద్దీన్ తెలిపారు.

జగ్గంపేట వైన్స్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): గుర్తు తెలియని దుండగులు వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని జగ్గంపేట శివారులో జరిగింది. ఎస్ఐ నర్సింహులు వివరాల ప్రకారం... హత్నూర మండలం తెల్లరాళ్ల తండాకు కాట్రోత్ రమేశ్, జగ్గంపేటలో గల ఎస్‌వీఆర్ వైన్స్ దుకాణంలో పనిచేస్తాడు. ప్రతిరోజు మాదిరిగానే, శనివారం రాత్రి 10 గంటలకు దుకాణం మూసేసి ఇంటికెళ్లాడు. ఆదివారం ఉదయం వైన్స్ పక్కనే ఉన్న కూల్‌డ్రింక్స్ షాప్ వ్యక్తి ఫోన్ చేసి దుకాణం షెట్టర్ తెరిచి ఉందని చెప్పగా రమేశ్ వెళ్లి చూశాడు. కౌంటర్‌లో చిల్లర కోసం ఉంచిన రూ.24 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించాడు. కాగా లిక్కర్ చోరీకి గురి కాలేదు.

దొంగతనం మోపడంతో..

మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య



మల్లం లింగం

చేర్యాల(సిద్దిపేట): దొంగతనం ఆరోపణలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్త దొమ్మాటలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... కొమురవెల్లి మండల పరిధిలోని అయినాపూర్‌కి చెందిన మల్లం లింగం(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. అయితే చోరీ జరిగిన ఇంటి యజమాని మృతుడు లింగంపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ నిమిత్తం ఇంటికి వచ్చిన ఓ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా లింగంపై చేయిచేసుకున్నట్లు ఆరోపించారు. చోరీ విషయమై రాఖీ పండుగ తరువాత మాట్లాడుకునేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం భార్యతో కలిసి రాఖీ కట్టేందుకు అత్తగారి ఊరు కొత్తదొమ్మాటకి వచ్చాడు. రాత్రి బంధువులతో గడిపిన అతడు తనపై వచ్చిన చోరీ ఆరోపణలతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నవీన్ తెలిపాడు.

పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాం

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు హల్దీవాగుపై నిర్మించిన కిష్టాపూర్ చెక్‌డ్యాంలోకి నీరువచ్చి చేరుతుంది. ఈ క్రమంలో చెక్‌డ్యాం పొంగిపొర్లుతుంది. చెక్‌డ్యాంను చూసేందుకు వచ్చిన ప్రజలు సెల్ఫీలు దిగుతున్నారు. – తూప్రాన్




కిష్టాపూర్ చెక్‌డ్యాం

డ్రాపౌట్స్‌కు వరం



తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు



ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు ఈనెల 1వతేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ విద్యకు రెగ్యులర్‌తో సమాన గుర్తింపు ఉంది. ఈ స్కూలులో పది పూర్తి చేసిన వారు ఆపై విద్యకు ఇంటర్ పూర్తి చేసిన వారు ఉన్నత విద్యకు కూడా అర్హులే. ప్రభుత్వ రంగంలో, చిరు ఉద్యోగాలు చేసుకునే వారికి పదోన్నతులకు కూడా అవకాశం ఉంటుంది.

– వెంకటస్వామి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, సంగారెడ్డి జిల్లా

ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- చివరి తేదీ ఈ నెల 18 వరకు
- జిల్లాలో 41 అధ్యయన కేంద్రాలు

సంగారెడ్డి క్రైమ్: కొందరికి చదువుపై ఆసక్తి ఉంటుంది. కానీ పలు కారణాలు, కుటుంబ పరిస్థితులతో పాఠశాల స్థాయిలోనే చదువు మధ్యలో ఆపి వేస్తుంటారు. మరికొందరు పది పూర్తయ్యాక కూడా పలు కారణాలతో ఇంటర్ విద్యకు వెళ్లకుండా చదువు మానేస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఏదో ఒక పనిలో నిమగ్నమవుతుంటారు. ఈ క్రమంలో మళ్లీ చదువుకోవాలని ఆసక్తి ఉన్న వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) అవకాశం కల్పిస్తుంది. సార్వత్రిక విద్యను దూర విద్య విధానంలో అందిస్తోంది. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు సంగారెడ్డి జిల్లాతో పాటు జోగిపేట్, పటాన్ చెరు, ఆత్మకూరులో కలిపి మొత్తం 41 పైగా అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. ప్రతి ఏడాది విద్యార్థులు ప్రవేశాలు పొంది తమ చదువును పూర్తి చేసుకుంటున్నారు.

దరఖాస్తు ఇలా..

- ఓపెన్ స్కూల్ విద్యా విధానంలో పదిలో ప్రవేశాలకు ఎలాంటి విద్యార్హత లేదు. కనీస వయసు 15 ఏళ్లు. ఆపై వయసు గల వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- తహసీల్దార్ లేదా మున్సిపల్ అధికారులు జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం ఉండాలి.
- పాఠశాల స్థాయిలో చదువు మానేస్తే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టిసి) ఆధార్ కార్డుతో ప్రవేశం పొందవచ్చు.
- ఇంటర్‌లో ప్రవేశాలు పొందే వారు తప్పనిసరిగా పది ఉత్తీర్ణత కలిగి ఉండాలి.
- ఈనెల 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్లు పొందవచ్చు.
- టెన్త్‌లో ప్రవేశాలకు ఫీజు ఓసీ అభ్యాసకులు రూ.1400, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీకి చెందిన వారు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది.
- ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లకు ఓసీ అభ్యాసకులు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వారు రూ.1200 చెల్లించాలి.
- ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించడంతో పాటు అడ్మిషన్లు తీసుకోవాలి.